పరవశించిన పాలమూరు

రహదారి పొడవునా జన నీరాజనం • హారతులు పట్టి పూలు చల్లిన ప్రజలు

కేసీఆర్ రాకతో ఉప్పొంగిన ఉత్సాహం • ఇంకా సీఎంగా ఉన్నట్టుగానే ఆదరణ

కేసీఆర్ ప్రసంగానికి జనం కేరింతలు • సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు

మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు బస్సుయాత్ర సభకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక ప్రతినిధి/మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)/జడ్చర్ల: పాలమూరులో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఎక్కడ చూసినా బీఆర్ఎస్ దళపతిపై అభిమానం వెల్లువెత్తింది. అడుగడుగునా ఘన స్వాగతం.. జై తెలంగాణ నినాదాలతో పట్టణం హోరెత్తింది. గడియారం చౌరస్తాలో కార్నర్ మీటింగ్ జనహోరును తలపించింది. శాసనసభ ఎన్నికల తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన కేసీఆర్‌ను చూడటానికి అభాలగోపాలం తండోపతండాలుగా తరలివచ్చింది. జడ్చర్ల, పాలమూరు రహదారులు గులాబీ పూతోటలను తలపించాయి. రైతులు, మహిళలు, వృద్ధులు దారిపొడవునా కేసీఆర్‌ను చూడటానికి బారులు తీరారు. జడ్చర్ల నుంచి ప్రారంభమైన రోడ్ షో మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రవేశించిన దగ్గర నుంచి ఎన్నికల ప్రచార సభ జరిగిన క్లాక్‌టవర్ వరకు రోడ్‌కు ఇరువైపులా కిక్కిరిసిన జనంతో పాలమూరు జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా జననేత కేసీఆర్‌పై పూలవర్షం కురిపించారు.–సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. డోలు, డప్పు వాయిద్యాల మధ్య కళాకారులు స్వాగతం పలికారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సతీమణి శారదతోపాటు బీఆర్ఎస్ మహిళా నేతలు కేసీఆర్‌కు హారతులు పట్టారు. తెలంగాణ సంప్రదాయక డప్పులు, డిల్లెం–పల్లెం వాయిద్యాలు ఒకవైపు, కేసీఆర్ జిందాబాద్ నినాదాలతో ప్రతిధ్వనించాయి. బస్సులో నుంచి కేసీఆర్ చేయి ఊపుతూ అభివాదం చేస్తూ ముందుకు సాగిపోవడంతో జనం ఆనందంతో పరవశించిపోయారు. కేసీఆర్‌ను చూడగానే జన హృదయాలు ఉత్సాహంతో నిండిపోయాయి. రైతులు పట్టరాని ఆనందంతో తమ మెడలో ఉన్న గులాబీ కండువాలు, పార్టీ జెండాలు ఊపుతూ డ్యాన్స్‌లు చేశారు. సభ జరిగిన క్లాక్ టవర్ చౌరస్తా కూడలిలో ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. చూట్టూరా ఉన్న షాపులపై కూడా కిక్కిరిసిన జనంతో నిండిపోయింది. తాను సీఎంగా ఉన్నప్పుడు అమలు చేసిన రైతుబంధు ఉంటదో.. ఊడుతదో అని కేసీఆర్ వేదికపై అన్నప్పుడు ప్రజల నుంచి వచ్చిన స్పందన వర్ణాణాతీతం. తాను ఉన్నపుడు ప్రభుత్వం ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లుండే అని కేసీఆర్ ప్రశ్నించినప్పుడు జనంలో నుంచి వ్యక్తమైన ఆర్తనాదాలు చూస్తే కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో వ్యతిరేకతకు అద్దం పట్టింది. ఒక్క ముసలమ్మ అయితే బిడ్డా 'నువ్వు ఉన్నప్పుడు ఒకరికి తెలియకుండా ఒకరికి పైసలు ఇచ్చేటోడివి.. ఇప్పుడెవ్వరు ఇస్తారు' అని కన్నీళ్ల పర్యాంతం అయింది. కేసీఆర్ పాలమూరుకు వస్తుండని తెలిసి చూద్దామని వచ్చాను బిడ్డా అని చెప్పింది.

కేసీఆర్‌కు పబ్బ తిపట్టిన పాలమూరు

కృష్ణమ్మను పారించిన యోధుడికి అపూర్వస్వాగతం

బస్సుయాత్ర దారిపొడవునా జయజయ ధ్వానాలు

మంగళహారతులు.. ఒగ్గుడోళ్ల చప్పళ్లతో చిందులు

ఈలలు, నినాదాలతో హోరెత్తించిన యువకులు

కేసీఆర్ బస్సు యాత్ర

మూడోరోజు డైరీ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల ఆర్తిని తీర్చి, వలసవెతలను తీర్చి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను సాకారం చేసిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాలమూరు నీరాజనం పలికింది. కండ్లారా చూసుకొని మురిసిపోయింది. కైమోడ్పులు చెప్పింది. కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజానీకం కదిలివచ్చింది. రైతులు, మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు చిన్నా పెద్ద అనే తేడా లేకుండా యావత్ మహబూబ్‌నగర్ పబ్బతి పట్టి జేజేలు కొట్టింది. మహబూబ్‌నగర్ క్లాక్ టవర్ వద్ద కేసీఆర్ చేసిన ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నది. బీజేపీ, కాంగ్రెస్ దగాను కేసీఆర్ ఎండగట్టిన తీరుకు ఈలలతో హోరెత్తించింది. బీఆర్ఆర్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర మూడోరోజైన శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌ను నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ మీదుగా శంషాబాద్ వద్ద దిగి పాలమాకుల మీదుగా జడ్చర్ల నియోజకవర్గంలోని మాచర్లకు 5.45 చేరుకున్నది. అక్కడ పుడ్‌కోర్టులో తేనేరు తీసుకున్న తర్వాత 6.30 గంటలకు బస్సుయాత్ర మళ్లీ ప్రారంభమైంది. జడ్చర్ల, కొత్తూరు మీదుగా మహబూబ్‌నగర్ పట్టణంలోని మట్టిగడ్డ ప్రాంతానికి చేరుకున్నది. న్యూటౌన్, బస్టాండ్ మీదుగా క్లాక్ టవర్‌కు చేరుకున్నారు. దారిపొడవునా గులాబీ దళపతికి పాలమూరు ప్రజానీకం పబ్బతి పట్టింది. కేసీఆర్ రాక తెలుసుకొని ఆయా రూట్లలోని సమీప గ్రామాల నుంచి ప్రజలు, కర్షకులు, మహిళలు భారీగా రోడ్లపైకి తరలివచ్చి జయ జయధ్వానాలు పలికారు. దారివెంట ఆటోలు, బస్సుల్లోని ప్రజలు సైతం బస్సుయాత్రలో కేసీఆర్‌ను చూసేందుకు ఎగబడ్డారు. రోడ్డువెంట ఉన్న రైతులు, దుకాణాదారులు కేసీఆర్‌కు కైమోడ్పులు చెప్పారు. బస్సుయాత్రలో కేసీఆర్ చూసి ఉద్యమనేతను కలగన్నారు. బస్సుయాత్రలో సెల్ఫీల కోసం ప్రజలు పోటీపడ్డారు. ముఖ్యంగా పట్టణవాసులు, యువతీ యువకులు బస్సుయాత్రను తమ మొబైల్ ఫోన్లలో బంధించుకున్నారు. బస్సులోని కేసీఆర్‌ను ఫొటోలు తీసుకుని మురిసిపోయారు. బస్సుయాత్ర కాన్వాయ్ పక్కన నిల్చుని ఫొటోలు దిగారు. బీఆర్ఎస్ శ్రేణుల సంబురానికి అంతులేకుండాపోయింది. అధినేతనే స్వయంగా తరలిరావడం ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. బస్సు యాత్ర దారిపొడవునా 'జై కేసీఆర్.. జై బీఆర్ఎస్'' నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ నమ్మి మోసపోయిన రైతాంగం కేసీఆర్‌ను చూడగానే గత పదేండ్ల పాలనను తలచుకున్నారు. 'తినే కూట్లే మన్నుపోసుకున్నం'' అని రైతులు చర్చించుకోవడం విశేషం.

రూ.2వేల నోట్ల మార్పిడికి టీటీడీకి ఆర్బీఐ అనుమతి

రూ.3.2కోట్ల నోట్లను మార్చుకోడానికి అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : రూ.2వేల నోట్ల మార్పిడికి తిరుమల టీటీడీకి ఆర్బీఐ మరో అవకాశం కల్పించింది. దేశవ్యాప్తంగా రూ.2వేల నోట్ల చెలామణిని కేంద్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 7 నుంచి నిలిపివేసిన విషయం తెలిసిందే. గడువు ముగిసిన తర్వాత కూడా భక్తులు స్వామి వారి హుండీలో రూ.2వేల నోట్లను సమర్పించగా రూ.3.2 కోట్ల రూ.2వేల నోట్లు ఉన్నట్లు టీటీడీ వెల్లడించింది. నోట్ల మార్పిడికి అవకాశం కల్పించాలని టీటీడీ ఉన్నతాధికారులు ఆర్బీఐకి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించింది. చెలామణిలో ఉన్న రూ. 2వేల నోట్లలో 97.62 శాతం తిరిగి బ్యాంకులకు చేరినట్లు ఆర్బీఐ మార్చిలో ప్రకటించింది. ఇంకా రూ.8,470 కోట్ల విలువైన కరెన్సీ ప్రజల వద్దే ఉందని పేర్కొన్నది. రూ.2వేల నోటు ఇప్పటికీ లీగల్ టెండర్‌గా కొనసాగుతుందని స్పష్టం చేసింది. రూ.2వేల నోట్లను ఆర్బీఐ నిరుడు మే 19న ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే.

రమణదీక్షితులుపై కేసులో పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : టీటీడీ మాజీ ప్రధానార్చకుడు ఏవీ రమణదీక్షితులుపై నమోదు చేసిన కేసులో పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. ఆయనకు సీఆర్పీసీ సెక్షన్ 41ఏ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యతిర్మయి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. టీటీడీ ప్రతిష్ఠ దిగజార్చేలా సోషల్ మీడియాలో శ్రీవారి ఆలయం, అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో టీటీడీకి చెందిన సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా మానిటరింగ్స్ అధికారి మురళీసందీప్ ఫిర్యాదు ఆధారంగా రమణదీక్షితులుపై ఫిబ్రవరి 23న పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ రమణదీక్షితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

కొత్తగా 1500 ఆర్టీసీ బస్సులు

కొనుగోలుకు టీఎస్ఆర్టీసీ నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. కొన్ని సందర్భాల్లో సీట్ల కోసం కొట్లాటలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీఆఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకొన్నది. 1500 ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వీలైనంత మేరకు అద్దె ప్రాతిపదికన ఎలక్ట్రిక్ బస్సుల్ని ఆర్టీసీ తీసుకొంటున్నది. ఇప్పుడున్న పాత బస్సుల స్థానంలో కొత్తవి కొనేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్యాంకు రుణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

జూలై కల్లా 450 ఎలక్ట్రిక్ బస్సులు

ఇక పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఇప్పుడు దాదాపు 105 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతుండగా.. మరో వెయ్యి పైచిలుకు రోడ్డెక్కించేందుకు ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తున్నది. ఇందులో జూలై కల్లా 450 అందుబాటులోకి వస్తాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా వచ్చే ఎలక్ట్రిక్ బస్సులను నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు.. అదేవిధంగా జిల్లాల్లో ఇతర ప్రాంతాలకు నడిపించేలా ఆర్టీసీ కార్యాచరణకు సిద్ధమవుతున్నది.

కాంగ్రెస్‌ను ఓడగొడతాం

గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్‌రాథోడ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 26 : గిరిజనులను మోసగించిన కాంగ్రెస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఓడగొట్టితీరుతామని గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్ రాథోడ్ స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మా ట్లాడుతూ, తమ ఓట్లతో గెలిచి తమ వర్గాన్నే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కన పెట్టారని, పైగా తెగల మధ్య చిచ్చు పెట్టే మ్యానిఫెస్టోను రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో 40లక్షలకు పైగా ఉన్న గిరిజనులకు మంత్రి , ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు ఎన్ని ఇచ్చారో చెప్పాలన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకా రం ఒక కుటుంబానికి రెండు అవకాశా లు ఇవ్వవద్దని, కానీ ఎమ్మెల్యే వివేక్ ఇంట్లో ముగ్గురికి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. తమకు అన్యా యం చేసిన కాంగ్రెస్‌కు రాష్ట్రంలోని గిరిజనులందరూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఓటు వేయకుండా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎస్పీనాయక్, బాలునాయ క్, అఖిల్‌రాథోడ్, లచ్చునాయక్, రవినాయక్, ప్రభాస్‌నాయక్ పాల్గొన్నారు.

'రిజర్వ్' స్థానాలు మొగ్గేదెటు?

కాంగ్రెస్‌పై కోయల అసంతృప్తి.. మాదిగలు గరంగరం

బీఆర్ఎస్ ప్రొడక్ట్స్‌కే టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్, బీజేపీ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఐదు రిజర్వ్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆసక్తికర పోరు నెలకొన్నది. గతంలో ఏ ఎన్నికల సందర్భంలోనూ లేని ప్రత్యేక వాతావరణం ఈసారి నెలకొన్నది. వీటిలో ఆదిలాబాద్, మహబూబూబాద్ ఎస్టీ నియోజకవర్గాలు. ఈ రెండు స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఒకే ఫార్ములాను అనుకరించడం ఆసక్తికరంగా మారింది. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆదిలాబాద్‌లో ఆదివాసీ, ఆదివాసీయేతరుల మధ్య దూరాన్ని పెంచి వారిని శత్రువర్గంగా మార్చిందనే విమర్శలను బీజేపీ మూటగట్టుకున్నది. ఆదిలాబాద్‌లో రాజుకున్న అగ్గి రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ, ఆదివాసీయేతర గిరిజనుల మధ్య సఖ్యతను ప్రశ్నార్థకం చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి ఆదిలాబాద్ టికెట్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు గోండు తెగకు కేటాయించాయి. మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని లంబాడీ/బంజారా తెగకు కేటాయించాయి. మహబూబాబాద్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో తమకు సరైన ప్రాధాన్యం కల్పించలేదని కోయ గిరిజన తెగ అలకబూనింది. దీంతో ఆ వర్గం ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్‌పై మాదిగల ఆగ్రహం

కాంగ్రెస్ పార్టీపై మాదిగ సామాజికవర్గం ఆగ్రహంగా ఉన్నది. రాష్ట్రంలోని మూడు రిజర్వ్ నియోజకవర్గాల్లో కనీసం ఏ ఒక్కచోట కూడా తమకు అవకాశం ఇవ్వకుండా, మాల సామాజికవర్గానికే ప్రాధాన్యం ఇచ్చిందని మాదిగ సామాజికవర్గం కాంగ్రెస్ పార్టీపై భగ్గుమంటున్నది. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ సహా అన్ని మాదిగ సామాజిక సంస్థలు, సంఘాలు కాంగ్రెస్‌పై విమర్శలు సంధిస్తున్నాయి. మాజీ మంత్రులు సర్వే సత్యనారాయణ, మోత్కుపల్లి నర్సింహులు లాంటి నేతలు కాంగ్రెస్‌పై ప్రత్యేకించి సీఎం రేవంత్‌రెడ్డిపై ఒంటికాలిపై లేస్తున్నారు. రాష్ట్రంలోని మాదిగ సామాజికవర్గ జనాభాకు అనుగుణంగా టికెట్ల కేటాయించలేదని, కనీసం ఒక్క స్థానంలోనైనా పోటీచేయడానికి మాదిగలకు అర్హత లేదా? అని ఆ వర్గం ప్రశ్నిస్తున్నది. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య అసలు మాదిగే కాదని, మాదిగ ఉపకులమని ఒకవర్గం, అసలు ఆమె ఎస్సీయేకాదని మరోవర్గం విమర్శలు గుప్పిస్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో రాజకీయం రసవత్తరంగా మారింది.

మంత్రి సీతక్క ప్రాధాన్యం తగ్గిందా?

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో భద్రాచలం, పినపాక, ఇల్లందు, డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో నర్సంపేట మినహా మిగిలిన ఆరు ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాలే. వీటిలో మహబూబాబాద్, డోర్నకల్ స్థానాల్లో లంబాడా/బంజారా ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పినపాక (పాయం వెంకటేశ్వర్లు), ఇల్లందు (కోరం కనకయ్య), భద్రాచలం (తెల్లం వెంకట్రావ్), ములుగు (మంత్రి సీతక్క) తోపాటు నర్సంపేట నియోజకవర్గాల్లో తమ సామాజికవర్గ జనాభా ఎక్కువ అని, పార్లమెంట్ స్థానం తమకే కేటాయించాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చినప్పటికీ, తమను ఆ పార్టీ విస్మరించిందని కోయ గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అభ్యర్థుల ఎంపికకు ముందు తప్పకుండా 'ఈసారి మనకే అవకాశం వస్తుంది' అని మంత్రి సీతక్క తమ వర్గీయులతో పేర్కొన్నట్టు తెలిసింది. ప్రభుత్వంలో సీతక్క ప్రభావాన్ని తగ్గించేందుకే కోయలకు టికెట్ కేటాయించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుత అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గతంలో కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణపై చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి నష్టం కలిగిస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్‌లో అందరూ బీఆర్ఎస్సే ప్రొడక్ట్సే

వరంగల్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి పోటీచేస్తున్న ముగ్గురు అభ్యర్థులు కూడా గతంలో బీఆర్ఎస్‌కు చెందినవారేకావడం గమనార్హం. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్ తెలంగాణ ఉద్యమం ఆవిర్భావం నుంచి కేసీఆర్ అడుగుజాడల్లో నడిచిన కార్యకర్త. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య రాజకీయ జీవితాన్ని బీఆర్ఎస్ నుంచే ప్రారంభించారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ పూర్వాశ్రమంలో ఒకసారి పీఆర్పీ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్‌లో చేరిన తరువాత రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి పోటీచేస్తున్న ఇద్దరు అభ్యర్థులు బీఆర్ఎస్ నీడలో ఎదిగినవారే. మొత్తంగా ఐదు రిజర్వ్ స్థానాల్లో మూడు పార్టీల నుంచి పోటీ చేస్తున్న 15 మందిలో 10 మంది బీఆర్ఎస్‌కు చెందినవారే కావడం మరో విశేషం.

రిజర్వ్ స్థానాల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి పోటీ పడుతున్న అభ్యర్థులు

పార్లమెంట్ స్థానం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
ఆదిలాబాద్ (ఎస్టీ)	ఆత్రం సుగుణ	ఆత్రం సక్కు	గోడం నగేశ్
మహబూబాబాద్ (ఎస్టీ)	పోరిక బలరాంనాయక్	మాలోత్ కవిత	అజ్మీరా సీతారాంనాయక్
పెద్దపల్లి (ఎస్సీ)	గడ్డం వంశీకృష్ణ	కొప్పుల ఈశ్వర్	గోమాస శ్రీనివాస్
నాగర్‌కర్నూల్ (ఎస్సీ)	మల్లు రవి	ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్	పోతుగంటి భరత్‌ప్రసాద్
వరంగల్ (ఎస్సీ)	కడియం కావ్య	మారపల్లి సుధీర్‌కుమార్	ఆరూరి రమేశ్

భారత్ బయోటెక్‌ను సందర్శించిన ఉపరాష్ట్రపతి

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : జీనోమ్ వ్యాలీలో ఉన్న భారత్ బయోటెక్ కంపెనీని భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ శుక్రవారం సందర్శించారు. వ్యాక్సిన్ల తయారీ, క్లిష్టమైన ప్రక్రియలను భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా, మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా ఉపరాష్ట్రపతికి వివరించారు. కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో భారత్ బయోటెక్ ముందజంలో నిలిచిందని ఉపరాష్ట్రపతి కొనియాడారు. అనంతరం మలేరియా, కలరా, క్షయ, చికున్ గున్యా వంటి వ్యాధులకు వ్యాక్సిన్ల తయారీని తెలుసుకున్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన జగ్దీప్ ధన్కర్‌కు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్వాగతం పలికారు.

తిరుమల శ్రీవారి సేవలో భక్తులకు అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : తిరుమల శ్రీవారి సేవలో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యాన్ని టీటీడీ తీసుకొచ్చింది. ఈ నెల 27న శ్రీవారి సేవ ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. టీటీడీ వెబ్‌సైట్, యాప్ ద్వారా భక్తులు తమ పేరు, వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 10 మంది భక్తులను ఒక్కో బృందంగా టీటీడీ అధికారులు ఎంపిక చేస్తారు. శ్రీవారి సేవకుల వయసు 18 నుంచి 60 ఏండ్ల లోపు ఉండాలి. ఎలక్ట్రానిక్ డిప్ సిస్టమ్ ద్వారానే శ్రీవారి సేవకులకు ఆలయ విధులు కేటాయిస్తారు.

టీటీడీ దవాఖానలను సందర్శించిన గవర్నర్ దంపతులు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్, శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ దవాఖానలను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం సందర్శించారు. మోకాలు కీళ్ల మార్పిడి, ఎముకల సంబంధిత వ్యాధులకు అందుతున్న చికిత్స, ఐసీయూ, ఔట్‌పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, డిజిటల్ ఎక్స్‌రే, సిటీ స్కాన్, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం, గుండె జబ్బులతో చికిత్స పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులను టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం సన్మానించారు. బర్డ్ దవాఖాన ప్రత్యేకాధికారి రెడ్డప్పరెడ్డి, పద్మావతి దవాఖాన డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి ఉన్నారు.